



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 128 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 20 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 128 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 20 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..




## పరాభవ నామ సంవత్సరంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ఏపీ ప్రభుత్వం ఉగాది వేడుకలు
- హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ
- 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపాలన్నదే లక్ష్యమని ప్రకటన
- జనాభా పెరుగుదల కోసం ప్రోత్సాహకాలు.. ఇద్దరు, ముగ్గురు పిల్లలుంటే ఆర్థిక సాయం

పెన్ పవర్ డెస్క్:పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ శుభాలను, విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ కమ్యూనిటీగా నిలపాలన్నదే తన సంకల్పమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యాలుగా ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

- మిగతా 2లో





## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను విప్‌లుగా నియమించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- అసెంబ్లీ విప్‌లుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, విజయరమణారావు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను రాష్ట్ర ప్రభు త్వం విప్‌లుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపారు.ఇక, అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో

# ఏపీలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం... అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

- రాష్ట్రంలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం
- 1,215 హెక్టార్లలో వ్యవసాయ, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలు ధ్వంసం
- పంట నష్టంపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1,215 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులతో అమరావతిలో సమీక్ష నిర్వహించారు.

కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 16 మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 2,043 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 630 హెక్టార్లలో మొక్కజొన్న, 384 హెక్టార్లలో వరి, 200 హెక్టార్లలో మినుము ఉన్నాయని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లో 267 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి, ఆరెంజ్ వంటి పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 307 మంది ఉద్యాన రైతులు నష్టపోయారని

ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ ప్రాథమిక అంచనాలపై స్పందించిన ముఖ్యమంత్రి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

- మిగతా 2లో



## ఉగాది నాడు మా కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

- 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల
- గ్రూప్ 1, గ్రూప్ 2 సహా పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు
- నిర్దేశిత సమయంలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని పవన్ హామీ
- గత 20 నెలల్లో 30,607 ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఉగాది పర్వదినాన తమ కూటమి ప్రభుత్వం రాష్ట్ర యువతకు తీపి కబురు చెప్పిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. నిర్దేశిత సమయంలోనే

- మిగతా 2లో




## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- ఇంధన అవసరాల తీరేలా సంబంధిత దేశాలతో మాట్లాడుతున్నట్లు వెల్లడి
- పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న రణధీర్ జైశ్వాల్
- కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారన్న జైశ్వాల్

పెన్ పవర్ డెస్క్:ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు

- మిగతా 2లో

## యుద్ధాన్ని ముగిస్తాం.. ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే అంశంపై స్పందించేందుకు నిరాకరణ
- అమెరికా ప్రణాళిక ప్రకారమే వెళుతోందన్న రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్
- ఏ లక్ష్యాలతో యుద్ధం ప్రారంభించామో వాటిని సాధించి మిషన్ పూర్తి చేస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. అయితే ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే విషయం చెప్పలేమని అన్నారు. యుద్ధం ముగింపుపై కచ్చితమైన కాలపరిమితిని చెప్పేందుకు ఆయన

- మిగతా 2లో



## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!



- ప్రముఖ జ్యోతిష్యుడు 'కెప్టెన్' అశోక్ ఖారట్ అరెస్ట్
- జ్యోతిష్యం పేరుతో మహిళలకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి
- పెన్‌డ్రైవ్‌లో 58 మంది మహిళల అత్యాచార వీడియోలు స్వాధీనం
- కేసు దర్యాప్తునకు ఐపీఎస్ అధికారిణి నేతృత్వంలో సిట్ ఏర్పాటు
- రాజకీయ, సినీ ప్రముఖులతో ఖారట్‌కు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ కీచక జ్యోతిష్యుడి గుట్టురట్టయింది. జ్యోతిష్యం, వాస్తు పేరుతో మహిళలను లోబర్చుకుని, లైంగికంగా దోపిడీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్యుడు, రిటైర్డ్ మర్చంట్ నేవీ అధికారి అశోక్ ఖారట్ (67) అలియాస్ 'కెప్టెన్'ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతని కార్యాలయంలో 58 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్

- మిగతా 2లో

## వైఎస్ బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు ఇచ్చారు.. షర్మిల ఖర్చులన్నీ చంద్రబాబువే



- జగన్ కంటే షర్మిలకే వైఎస్సార్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్న సతీశ్ రెడ్డి
- జగన్ సంపాదించుకున్న ఆస్తుల్లో కూడా వాటా అడగడం ధర్మం కాదని వ్యాఖ్య
- చంద్రబాబు చేతిలో షర్మిల, సునీత పావులు అని విమర్శ

పెన్ పవర్ డెస్క్:వైఎస్ కుటుంబం చుట్టూ తిరుగుతున్న రాజకీయ వివాదాలపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడిస్తున్న నాటకంలో షర్మిల, సునీత కేవలం పావులని అన్నారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ప్రతీకారంతో ఇరాన్

గల్ఫ్ ప్రాంతంలో చమురు, వాయువు కేంద్రాలపై ఇరాన్ గురువారం దాడులు పెంచింది. ఇప్పటికే కొనసాగుతున్న యుద్ధానికి ఇది మరింత తీవ్రత తీసుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ ఇరాన్ కీలక వాయువు క్షేత్రంపై దాడి చేసిన తర్వాత ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టింది. దీంతో ఇంధన ధరలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి గల్ఫ్ దేశాలు కూడా నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం ఉందన్న ఆందోళన పెరిగింది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టు ఉండటం వల్ల ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ చమురు సరఫరా మరింత ఇబ్బందుల్లో పడింది.

**యూఏఈ తీరంలో...**

యూఏఈ తీరంలో ఓ నౌకకు మంటలు అంటుకున్నాయి. ఖతర్ సమీపంలో మరో నౌక దెబ్బతినింది. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా భద్రంగా లేవని స్పష్టమైంది. ఎర్ర సముద్రం వద్ద సౌదీ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 118 డాలర్ల వరకు చేరింది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా దాడులు మొదలైన తర్వాత ఇది 60 శాతానికి పైగా పెరిగింది. ఇంధన ధరల ప్రభావంతో జరగనున్న యూరోపియన్ యూనియన్ సమావేశానికి ముందే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పరిస్థితిని తీవ్రంగా అభివర్ణించారు. యుద్ధ విరమణ, చర్చలు అవసరమని కోరారు.

**గల్ఫ్ దేశాల్లో దాడులు...**

ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ ఇరాన్ చర్యలను ఖండించాయి. అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ అబౌల్ ఘైట్ దీనిని ప్రమాదకర ఉద్రిక్తతగా పేర్కొన్నారు. సౌదీ అరేబియా రాజధాని రియాద్, తూర్పు ప్రాంతాల్లో ఆరు డ్రోన్లను అడ్డుకుంది. యన్‌బూ పోర్టులోని సామ్‌రెఫ్ రిఫైనరీపై దాడి జరిగినట్లు తెలిపింది. హోర్ముజ్ మార్గాన్ని తప్పించేందుకు సౌదీ ఇప్పటికే ఎర్ర సముద్రం వైపు చమురు తరలిస్తోంది. ఖతర్‌లోని రాస్ లాఫాన్ ఎల్ఎన్‌జీ కేంద్రంపై క్షిపణులు పడటంతో భారీ నష్టం వాటిల్లింది. అక్కడ మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పారు. ముందస్తు దాడుల వల్ల ఉత్పత్తి ఇప్పటికే ఆగిపోయింది. ఇది ప్రపంచానికి వాయువు సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**గ్యాస్ నిక్షేపాలపై దాడులతో...**

కువైట్‌లోని మీనా అల్-అహ్మది రిఫైనరీలో డ్రోన్ దాడితో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమీపంలోని మీనా అబ్దుల్లా కేంద్రంలో కూడా మంటలు చెలరేగాయి. అబుదాబిలోని హబ్‌షాన్ గ్యాస్ కేంద్రం, బాబ్ ఫీల్డ్ కార్యకలాపాలు నిలిపివేశారు. ఇరాన్ దాడులు ప్రమాదకరంగా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు దెబ్బతిన్నా ప్రాణనష్టం పెద్దగా లేదు. ప్రపంచంలో అతిపెద్ద వాయువు క్షేత్రంగా గుర్తింపు పొందిన సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇది ఇరాన్, ఖతర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టు. ఇరాన్‌లో విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 80 శాతం సహజ వాయువుపైనే ఆధారపడుతోంది. దీంతో ఈ దాడి దేశ విద్యుత్ సరఫరాపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఈ దాడితో మరింత తీవ్రతరం...**

ఈ దాడితో యుద్ధం మరింత విస్తరించినట్లు పరిశోధనా సంస్థలు పేర్కొన్నాయి. ప్రజల జీవన పరిస్థితులను కష్టతరం చేయాలనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ లక్ష్యాలను ఎంచుకుంటోందని విశ్లేషించాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ దాడులు నియంత్రణ తప్పితే ప్రపంచానికే ముప్పు ఉంటుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్ ఖతర్ శక్తి కేంద్రాలపై దాడులు కొనసాగిస్తే అమెరికా కూడా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు.

**ప్రదర్శనల్లో అరెస్టయిన ముగ్గురికి ఉరి**

జనవరిలో జరిగిన నిరసనల సమయంలో అరెస్టైన ముగ్గురిని ఇరాన్ ఉరిశిక్ష అమలు చేసింది. కోమ్ నగరంలో ఇద్దరు పోలీసులను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆందోళనలను అణచివేసే సమయంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణల్లో న్యాయం జరగడం లేదని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడో వారంలోకి ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం చేరింది. మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో 1,300 మందికిపైగా మరణించారు. లెబనాన్‌లో హిజ్బుల్లా దాడుల కారణంగా 10 లక్షల మందికి పైగా ప్రజలు నివాసాలు విడిచారు. 900 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్‌లో ఇరాన్ క్షిపణి దాడుల్లో 15 మంది మృతిచెందారు. వెస్ట్ బ్యాంక్‌లో నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు.

## వైఎస్ బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు ఇచ్చారు..

# షర్మిల ఖర్చులన్నీ చంద్రబాబువే

వైఎస్ కుటుంబ ఆస్తుల తగాదాపై వస్తున్న ఆరోపణలను సతీశ్ రెడ్డి తిప్పికొట్టారు. "వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నప్పుడే షర్మిలకు భారీగా ఆస్తులు రాసిచ్చారు. జూబ్లీహిల్స్ ఇల్లు, ఇడుపులపాయ భూములు, హైడ్రో ప్రాజెక్టుల్లో వాటాలు.. ఇలా కొడుకు కంటే కూతురికే వైఎస్సార్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు జగన్ తన స్వార్జితంతో సంపాదించుకున్న ఆస్తుల్లో కూడా వాటా కావాలని అడగటం ధర్మం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో షర్మిల ఖర్చు చేసిన ప్రతి పైసా చంద్రబాబు ఇచ్చినదేనని ఆయన ఆరోపించారు. వివేకా హత్య జరిగే సమయానికే అవినాశ్ రెడ్డికి జగన్ ఎంపీ సీటు ఖరారు చేశారని, వివేకా కూడా ఆయన గెలుపు కోసమే పనిచేశారని గుర్తు చేశారు. సీటు కోసం హత్య చేశారనడం అవివేకమని కొట్టిపారేశారు. భూమి వివాదంలో ఎర్ర గంగిరెడ్డి, వివేకా మధ్య గొడవలు ఉన్నాయని స్వయంగా దస్తగిరి స్టేట్‌మెంట్ ఇచ్చాడని, కానీ సునీత మాత్రం ఉద్దేశపూర్వకంగా అవినాశ్ ను ఇరికించాలని చూస్తున్నారని విమర్శించారు. "అవినాశ్ ఇప్పటికీ సునీతక్క, వివేకం పెదనాన్న అని గౌరవంగా మాట్లాడుతుంటే.. సునీత మాత్రం వివేకా

పేరును, ఇమేజ్‌ను చెడగొడుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టి ఎందుకు వదిలేశారో అందరికీ తెలుసని, ఏపీలో జగన్‌ను ఇబ్బంది పెట్టడానికే ఆమెను చంద్రబాబు ఇక్కడికి తెచ్చారని సతీశ్ రెడ్డి ఆరోపించారు. సునీత, షర్మిల, చంద్రబాబు, దస్తగిరి... వీరందరికీ కోర్టులో వాదించేది ఒక్కరే న్యాయవాది అని, దీనిని బట్టే వీరి వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరో అర్థమవుతోందని స్పష్టం చేశారు.

# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..

- మొదటి పేజీ తరువాయి

**సంస్కృతి, సాంప్రదాయాలకు సైన్స్ జోడింపు**

ఉగాది పండుగ తెలుగువారి తొలి పండుగ అని, మన సంస్కృతి, సాంప్రదాయాల్లో సైన్స్ ఇమిడి ఉందని చంద్రబాబు వివరించారు. ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన ఆచారాలైన వాస్తు, యోగా, ధ్యానం వెనుక శాస్త్రీయత దాగి ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇవి దోహదపడతాయని అన్నారు. గతంలో తాను ఐటీ ప్రాముఖ్యతను గుర్తించి ప్రోత్సహించడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. తాను కూడా సెల్ ఫోన్ ద్వారానే పాలన సాగిస్తూ, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్నానని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం**

2024కు ముందు రాష్ట్రంలో పండుగలు కూడా జరుపుకోలేని భయానక వాతావరణం ఉండేదని, అరాచకాలు, విధ్వంసంతో ప్రజలు విసిగిపోయారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలలుగా సమ్మిళిత సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని పైకి తీసుకురావడానికి, ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది చేయూతనివ్వాలని కోరుతూ 'మార్గదర్శి బంగారు కుటుంబం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

**ఉగాది కానుకగా ఉద్యోగాల జాతర**

యువత భవిష్యత్తుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉగాది పండుగ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి ఏటా ఉగాది రోజున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 10,060 ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేశారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, హోంశాఖ, ఉన్నత విద్య, ఇంజనీరింగ్ వంటి పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మే 15 నుంచి అక్టోబర్ 15 మధ్య ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులతో సహా మొత్తం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని గుర్తుచేశారు.

**పోలవరం, అమరావతిపై స్పష్టమైన హామీ**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, త్వరలోనే మిగిలిన నిధులను కూడా సమకూర్చుకుని పనులు వేగవంతం చేస్తామన్నారు. అమరావతి దేవతల రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ప్రజల రాజధాని అని పేర్కొన్నారు. అమరావతిని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి, సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని వెంకటేశ్వర స్వామిని ప్రతిరోజూ ప్రార్థిస్తానని తెలిపారు.

**కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కొత్త విధానాలు**

మారుతున్న కాలంతో పాటు కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులపై చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయని, అందుకే జనాభా నిర్వహణపై కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు. "ఒకరు వద్దు, ఇద్దరు ముద్దు, ముగ్గురుంటే ఇంకా మంచిది" అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం అందించి కుటుంబాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. పెద్ద కుటుంబాలు సుఖసంతోషాలకు నిలయాలని, విడిపోవడం కంటే కలిసి ఉండటానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

**2047 నాటికి తెలుగుజాతి నంబర్ వన్**

ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మనపై ప్రభావం చూపుతాయని, ఇలాంటి సమయంలో మనం తప్పులు చేయకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని చంద్రబాబు హితవు పలికారు. పరాభవ నామ సంవత్సరం తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పే సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. 2047 నాటికి భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి తెలుగువారు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. సంపదతో పాటు విలువలను కాపాడుకుంటూ, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేస్తూ, అందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలిపి తన ప్రసంగాన్ని ముగించారు.

## ఉగాది నాడు మా కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

- మొదటి పేజీ తరువాయి

ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం యువత ఆకాంక్షలను మనసుతో అర్థం చేసుకుంటోందని తెలిపారు. ఈ ఏడాది విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ వంటి పలు విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు. గత 20 నెలల కాలంలో తమ ప్రభుత్వం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని

పవన్ గుర్తుచేశారు. ఇటీవల ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినప్పుడు యువత కళ్లలో ఆనందం చూశామని తెలిపారు. తాజా ప్రకటన నేపథ్యంలో ఉద్యోగార్థులు ఏమాత్రం సమయం వృథా చేయకుండా ప్రిపరేషన్‌లో నిమగ్నం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## యుద్ధాన్ని ముగిస్తాం.. ఎప్పుడు అనేది అంతిమ నిర్ణయం ట్రంప్‌దే

- మొదటి పేజీ తరువాయి

నిరాకరించారు. యుద్ధం విషయంలో అంతిమ నిర్ణయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌దే అన్నారు. యుద్ధం ముగింపునకు తాము కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించుకోలేదని తెలిపారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇరాన్ దాడికి పాల్పడడంతో ఆగ్రహించిన అమెరికా తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. ఇరాన్‌పై ఈ రోజు భారీ స్థయిలో దాడులకు పాల్పడుతామని, గల్ఫ్ యుద్ధాన్ని తమదైన స్టయిల్లో ముగిస్తామని పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. చనిపోయిన వారిని గౌరవిస్తామని, అనుకున్న పనిని పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యుద్ధాన్ని ముగిస్తామని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధానికి దిగిన మొదటి రోజు నుంచి తమ లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన వెల్లడించారు. ఇరాన్ రక్షణ, క్షిపణి తయారీ కేంద్రాలను నాశనం చేశామని, కాబట్టి ఆ దేశం కొత్తగా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసుకోలేదని అన్నారు. అంతేకాదు ఇరాన్‌కు చెందిన 11 జలాంతర్గాములను ముంచివేసినట్లు తెలిపారు. ఏయే లక్ష్యాలతో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభించామో అవన్నీ సాధించి, తాము అనుకున్న మిషన్‌ను పూర్తి చేస్తామని పీట్ హెగ్సెత్ అన్నారు.

## జ్యోతిష్యుడి ముసుగులో కామ పిశాచి... 58 మంది మహిళలపై అఘాయిత్యం!

- మొదటి పేజీ తరువాయి

లభించడం కేసు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు దర్యాప్తు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. వివరాల్లోకి వెళితే, నాసిక్‌లోని కెనడా కార్నర్ ప్రాంతంలో అశోక్ ఖారట్ 'ఓకస్ ప్రాపర్టీ డీలర్స్ అండ్ డెవలపర్స్' పేరుతో కార్యాలయం నడిపేవాడు. తనను తాను 'కెప్టెన్' అని, ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకునేవాడు. వివాహ సమస్యలతో బాధపడుతున్న 35 ఏళ్ల మహిళ ఒకరు 2022లో ఇతడిని సంప్రదించింది. ఆమె భర్తకు ప్రాణగండం ఉందని, ప్రత్యేక పూజలతో దానిని నివారిస్తానని నమ్మబలికాడు. అనంతరం ఆమెకు మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి, హిప్నటైజ్ చేసి, భయపెట్టి 2025 డిసెంబర్ వరకు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నాసిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, కారట్ ఫార్మ్‌హౌస్‌పై దాడి చేసి చాకచక్యంగా అతడిని అరెస్టు చేశారు. ఈ సోదాల్లో ఒక పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతని కార్యాలయంలో రహస్యంగా అమర్చిన సీసీటీవీ కెమెరాలను గుర్తించారు. అక్కడ లభించిన ఒక పెన్‌డ్రైవ్‌లో 58 మంది వేర్వేరు మహిళలపై లైంగిక దాడి చేస్తున్న వీడియోలు ఉండటంతో పోలీసులు నిర్ఘాంతపోయారు. మత్తుమందులు, చేతబడి వంటివి ప్రయోగించి మహిళలను లొంగదీసుకుని, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులతో

ఖారట్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకణ్‌కర్‌పై కూడా విమర్శలు రావడంతో ఈ కేసు రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారిణి తేజస్వినీ సత్పుతే నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు వీడియోలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపి, ఇతర బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 64 (రేప్), బ్లాక్ మ్యాజిక్ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, అతడిని కోర్టులో హాజరుపరచగా మార్చి 24 వరకు కస్టడీకి అప్పగించారు. సిట్ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణ అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వ విప్‌ల నియామకం

- మొదటి పేజీ తరువాయి

విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు.

## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- మొదటి పేజీ తరువాయి

తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మనదేశానికి చేరుకున్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

## 99 రోజుల తర్వాత జైలు నుంచి పిన్నెల్లి విడుదల.. ఎవరినీ వదిపెట్టబోమని హెచ్చరిక!



పల్నాడు రాజకీయాల్లో కీలక నేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకుల జంట హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, నేడు ఆయన నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా జైలు వెలుపల వైసీపీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైలు నుంచి విడుదలైన అనంతరం పిన్నెల్లి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నమోదైన కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన మండిపడ్డారు. "వెల్దుర్తి మండలంలో జరిగిన టీడీపీ వర్గాల అంతర్గత గొడవలకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆధిపత్య పోరులో జరిగిన హత్యల ఘటనలో నన్ను ఉద్దేశపూర్వకంగా నిందితుడిగా ఇరికించారు" అని ఆయన స్పష్టం చేశారు. నాడు జిల్లా ఎస్పీ సైతం ఈ ఘటనను ఇరువర్గాల మధ్య జరిగిన పోరుగా తేల్చినప్పటికీ, ప్రభుత్వం తనను అన్యాయంగా 99 రోజులు జైల్లో పెట్టి మానసిక క్షోభకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "భవిష్యత్తులో మాకు తప్పకుండా ఒక రోజు వస్తుంది. ఆరోజు దీని వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు లాగుతాం. రాజకీయ నాయకులైనా, అధికారులైనా సరే... చట్టం ముందు నిలబెట్టి తీరుతాం. ఎవరినీ వదిలిపెట్టే సమస్యే లేదు" అని ఆయన హెచ్చరించారు. పిన్నెల్లి విడుదలతో మాచర్ల, వెల్దుర్తి ప్రాంతాల్లోని వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అయితే, ఇదే కేసులో ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి బెయిల్ నిరాకరించడంతో ఆయన ఇంకా జైలులోనే ఉన్నారు.

## హర్యానాలో ఆరేళ్లలో గుండెపోటుతో

# 17,973 మరణాలు

రాష్ట్రంలో 2020 జనవరి నుంచి 2026 జనవరి మధ్య కాలంలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గలవారు వేల సంఖ్యలో గుండెపోటుతో మరణించినట్లు అసెంబ్లీలో హర్యానా ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆరేళ్ల కాలంలో 17,973 మంది గుండెపోటు కారణంగా మరణించినట్లు అసెంబ్లీలో తెలిపింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత ఆరేళ్ల కాలంలో ఏ జిల్లాలో, ఎంతమంది, ఎంత వయస్సు కలిగిన వారు, హార్ట్ ఫెయిల్ కారణంగా మరణించారో తెలియజేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగారు. ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సీన్‌తో సంబంధం ఉందా, ఆ దిశగా ఏమైనా చర్యలు చేపట్టారా? అని ప్రశ్నించారు. అలాంటి సర్వేను నిర్వహించలేదని ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. జిల్లాల వారీగా, ఏ సంవత్సరంలో ఎంతమంది గుండెపోటుతో మరణించారో తెలిపింది. సంవత్సరాల వారీగా చూస్తే, 2020లో 2,394 మరణాలు సంభవించగా, 2021లో 3,188, 2022లో 2,796, 2023లో 2,886, 2024లో 3,063, 2025లో 3,255 మరణాలు జరిగినట్లు తెలిపింది. 2026 జనవరిలో 391 గుండెపోటు మరణాలు నమోదైనట్లు తెలిపింది.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# గోకవరంలో భారీ వర్షం.....
# జల దిగ్ధమైన రోడ్లు.....

## ఊర కాలువ ఆక్రమణలు తొలగిస్తారా..... వదిలేస్తారా.....

## ఊర కాలువను పూడ్చివేసి లే అవుట్ లా....



**గోకవరం పెన్ పవర్ మార్చి 19:-** గతవారం రోజులుగా విపరీతమైన సూర్య భగవానుడు గోకవరం మండల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయడంతో తెలుగు సంవత్సరాది ఉగాది నాడు వరుణ దేవుడు గోకవరం మండల ప్రజలపై కరుణచూపాడు సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా గోకవరం లో కుండపోత వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి సుమారు 40 నిమిషాల వరకు కుండపోత వర్షం కురవడంతో ఎక్కడ ప్రజలు అక్కడే ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి అనుకోకుండా వచ్చిన వర్షంతో కొంతమంది ప్రజలు ప్రయాణికులు బాటసారిలు ఇబ్బందులు పడ్డ మొత్తానికి వాతావరణ చల్లబడటంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే ఎండలు విపరీతంగా కాయడం వర్షాలు అతి తక్కువగా ఉంటాయంటూ సామాజిక మాధ్యమా వార్తలు రావడంతో ఎండల తీవ్రత తట్టుకోలేమేమో అని భయపడి పోతున్న గోకవరం మండల ప్రజలకు వరుణ దేవుడు రాకతో ఊరట కలిగిందనే చెప్పాలి.

**ఊర కాలువ ఆక్రమణలు తొలగిస్తారా.వదిలేస్తారా :**

ఇది ఇలా ఉండగా ఇప్పుడే ఇలాంటి వర్షాలు కురవడం భవిష్యత్తులో మరిన్ని పెద్ద పెద్ద వర్షాలు కురిస్తే ఊర కాలవ ఆక్రమణ తో గోకవరాన్ని ముంచేత్తే ప్రమాదం ఉందని గత అనుభవాలు జిల్లా కలెక్టర్ పర్యటన సందర్భంగా ఊర కాలవ ఆక్రమణలు తొలగింపు పై ఆదేశాలు ఇవ్వడం జరిగింది. వాటిపై ఇప్పటి వరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం ఇరిగేషన్ శాఖ పూర్తి నిర్లక్ష్యం గా కనిపిస్తుందని కలెక్టర్ ఆదేశాలు లెక్కచెయ్యకుండా ఇరిగేషన్ శాఖ వ్యవహరిస్తున్నారని ఇదంతా ఒక ఎత్తు అయితే




గోకవరంలో కొన్నిచోట్ల ఊర కాలువ పూడ్చివేసి అనధికారిక లే అవుట్ లు వేస్తున్నా గోరకాలవ స్థితిగతి ఎలా ఉన్నదనేది కూడా చూస్తున్నారో లేక రియల్ ఎస్టేట్ దారుల దగ్గర్నుంచి లంచాల రూపంలో తీసుకుంటున్నారో తెలియదు కానీ గోకవరం మండలానికి సంబంధించిన ఇరిగేషన్ శాఖ అధికారులు మౌనం వెనుక భారీ మూల్యమే గోకవరం మండల ప్రజలు చెల్లించాల్సి ఉంటుందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గోకవరం మండలంలో ఊర కాలవను పూర్తిగా పూడ్చివేసి లేఅవుట్లు వేయడం పట్ల ఎలాంటి అనుమతులు లేకపోయినా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు మౌనం పట్ల జిల్లా కలెక్టరే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గోకవరంలోని ఊర కాలువ పూడ్చి వేసి లేఔట్లు వేయడంపై మండల ఇరిగేషన్ శాఖ అధికారులకు మరియు డివిజనల్ అధికారి వారికి ఫోన్ల ద్వారా వివరణ కోరేందుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం పట్ల అనుమానాల వ్యక్తం అవుతున్నాయి




పోలవరం జిల్లా గంగవరం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కనులవిందు చేసిన ఇంద్రధనస్సు పెన్ పవర్ -గంగవరం

## ఉగాది రోజున భారీ వర్షం - సేద తీరిన జనం, రైతుల్లో మిశ్రమ స్పందన





**గంగవరం, పెన్ పవర్, మార్చి 19:**వేసవి ఎండల తాకిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉగాది పర్వదినాన ప్రకృతి చల్లని కానుక అందించింది. పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో గురువారం మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఆకస్మికంగా మారి ఈదురు గాలులు, ఉరుములు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది.గత వారం రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కురిసిన ఈ వర్షం ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ముఖ్యంగా ఉగాది రోజునే వర్షం కురవడం శు భసూచకంగా భావిస్తూ, ఈ సంవత్సరం పంటలు బాగా పండుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే రైతుల్లో మాత్రం మిశ్రమ స్పందన కనిపిస్తోంది. మామిడి, జీడిమామిడి పంటలకు ఈ వర్షం కొంతవరకు మేలు చేస్తుందని కొందరు రైతులు అభిప్రాయపడుతుండగా, మరికొందరు వడగండ్ల వర్షం కారణంగా పంటలకు నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మొత్తంగా ఉగాది పర్వదినాన కురిసిన ఈ వర్షం ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగించడంతో పాటు, రైతుల్లో ఆశలు, ఆందోళనలు రెండింటినీ మిగిల్చింది.



పాలకొల్లు లోని వెంకటేశ్వర స్వామి గుడిలో ఉగాది సందర్భంగా ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

# ప్రాణాల మీద పెట్టి సేవ చేసిన మత్యకరులకు కూలి లేదు

## చింతూరులో అధికారుల నిర్లక్ష్యం బహిర్గతం









**చింతూరు పెన్ పవర్ మార్చి 19:** గత ఏడాది వరదల సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలను రక్షించిన చింతూరు మండల మత్యకరులు ఇప్పుడు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారు. జూన్ 27 నుంచి అక్టోబర్ 3 వరకు కొనసాగిన వరదల సమయంలో రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో, స్థానిక మత్యకరులు తమ నాటు పడవలతో ప్రజలకు ప్రాణాధారంగా నిలిచారు.

ప్రభుత్వ పడవలతో పాటు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన మత్యకరులు 24 రోజుల పాటు నిరంతరం సేవలు అందించారు. ప్రజలను ఒక ఒడ్డునుంచి మరొక ఒడ్డుకు తరలించడం, రోగులను ఆసుపత్రులకు చేర్చడం, నిత్యావసర సరుకులను చేరవేయడం, ప్రభుత్వ సిబ్బంది రాకపోకలకు సహకరించడం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను కూడా కుటుంబ సభ్యులకు చేర్చడం వంటి సేవలు చేశారు. ఈ సేవలకు ప్రతిఫలంగా రోజుకు రూ.2000 చొప్పున కూలి చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా అందలేదని మత్యకరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం, ఐటిడిఏ కార్యాలయాల చుట్టూ తిరిగినా పెండింగ్‌లో ఉంది, డబ్బులు రాలేదు అనే సమాధానాలే వినిపిస్తున్నాయని వారు చెబుతున్నారు.

చింతూరుకు చెందిన మత్యకరుడు యర్రం శ్రీను మాట్లాడుతూ, 24 రోజులు ప్రాణాల మీద పెట్టి రోగులను, ప్రజలను దాటేశాం. ఇప్పటికీ మా కష్టానికి డబ్బులు ఇవ్వలేదు. రోజులు తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా స్పందన లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.మత్యకరుడు యర్రం నాగరాజు మాట్లాడుతూ, మాకు చేపల వేటే జీవనాధారం. వేట వదిలేసి సేవ చేశాం. వరదల్లో చనిపోయిన వారినీ దాటించాం. కానీ అధికారులు కూలి ఇవ్వకపోవడం బాధాకరం. కనీసం భోజనం కూడా పెట్టకుండా పని చేయించారు అని విమర్శించారు.ఇలాంటి పరిస్థితులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విపత్తు సమయంలో సేవలందించిన వారికి న్యాయం చేయకపోవడం అన్యాయం అని పేర్కొంటున్నారు. మత్యకరులకు పెండింగ్‌లో ఉన్న కూలి వెంటనే విడుదల చేసి, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



భీమవరంలోని సోమ సూత్రం గల శివాలయంలో గురువారం ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణలో శివయ్య

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉగాది పచ్చడి షడ్రుచుల వలె మనవ జీవన శైలి ముందుకు సాగాలి





**ఉగాది పురస్కార మహోత్సవంలో ఎంపీ పురందేశ్వరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 19:** ఉగాది ప్రకృతితో ముడిపడిన పండుగ అని, ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనమని , పంచాంగం మనవ జీవన శైలిలో అంతర్భాగమని, గమనం తెలుసుకుని మానవాళి ముందుకు సాగాలని ఎంపీ పురందేశ్వరి అన్నారు. రాబోయే కాలం ఎలా ఉండబోతుందన్నది ఉగాది పంచాంగం అందిస్తుందన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార మహోత్సవం స్థానిక జె.కె గార్డెన్స్ లో ఎంపీ పురందేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ వేడుకలో కవిపండితులకు, కళాకారులకు సత్కారం చేసారు.

ఈసందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ, పరాభవ నామ సంవత్సరం అంటే దుర్గుణాలకు, దురాచారాలకు పరాభవంగా, మంచికి విజయంగా భావించాలని ఆమె విశ్లేషింస్తు ఆమె ఉగాది శుభాకాంక్షలు తెలియజేసారు. తొలుత విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాస శర్మ శిష్యబృందం నృత్య ప్రదర్శనతో అలరించారు. పుల్లెల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేసారు. ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షుడు పీక్కి నాగేంద్ర, తదితరులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, అరిపిరాల నారాయ ణరావు, దోర్బల ప్రభాకర శర్మ , సిహెచ్. కూర్మయ్య, తలారి వాసు, జిత్ మోహన్ మిత్ర, గూటం స్వామి, చాగంటి మాలతి, శ్రీపాద సీతామహాలక్ష్మీ, గొడవర్తి రమాదేవి, తదితరులను సత్కరిం చారు. అనంతరం ఎంపీ పురందేశ్వరిని మహిళా బృందం ఘనంగాసత్కరించింది. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు , నీరుకొండ వీరన్న చౌదరి, అడబాల రామకృష్ణ, వాడ్రేవు అలివేలు, మద్దిపాటి రజని, వీరా వీరాంజనేయులు, యానాపు ఏసు, కాలెపు సత్య సాయిరాం, తగరం సురేష్, శ్రీవిద్య, పన్నాల లక్ష్మి సంతోషి, కొత్తపల్లి గీత, మరుకుర్తి నరేష్ యాదవ్, అధికారుల లక్ష్మి, మీనాక్షి , అడపా వరప్రసాద్ ,కందుకూరి రమేష్ ,డాక్టర్ ఉమా, ఈశ్వర్, కూటమి నాయకులు , మహిళలు, తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయానికి కుర్చీలు బహుకరించిన పూర్వ విద్యార్థులు



**పెన్ పవర్, ఉంగుటూరు, మార్చి 19:**చేబ్రోలు శ్రీ బాల సరస్వతి గ్రంథాలయంలో చదువరుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేబ్రోలు గ్రామ సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత రాజారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు గ్రంథాలయానికి 15 కుర్చీలను విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల భవానీశ్వరరావు, కె. సీతారామాంజనేయులు, యూ. వెంకటేశ్వరరావు, కె. అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది రోజున భారీ వర్షం - సేద తీరిన జనం



**వై రామవరం, పెన్ పవర్,మార్చి 19:** వేసవి తాపాన్ని చల్లబరుస్తూ ఉగాది పర్వదినం రోజునే భారీ వర్షం కురిసింది.

నూతన తెలుగు సంవత్సరాదికి స్వాగతం పలుకుతూ వర్షం కురవడంతో ప్రజల ఆనంద వ్యక్తం చేస్తున్నారు. భారీ ఉరుములు,ఈదురు గాలుల మధ్య భారీ వర్షం కురిసింది. మామిడి, జీడిమామిడి రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. నూతన సంవత్సరాది రోజున వర్షం కురవడం, ఈ సంవత్సరం పంటలు బాగా పండుతాయి అని రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## వైసీపీ సిటీ పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలు



**కార్యకర్తలకు బీమా పత్రాలు అందచేసిన భరత్**


**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19:**శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు వైసీపీ పార్టీ కార్యాలయంలో గురువారం తమ కుటుంబ సభ్యులతో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ నిర్వహించారు.

తొలుత లక్షివారపు పేట, పార్టీ నాయకులు మహాలక్ష్మి మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమాలమ్మ అమ్మ వారి జాతర లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పండితులు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం, పంచాంగ శ్రవణశీ నిర్వహించారు.

ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది రాష్ట్ర ప్రజలకు, నగర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు .ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని, సూపర్ సిక్స్ అమలు చేయాలని కోరారు. కొత్త తెలుగు సంవత్సరాది రోజున కార్యకర్తలకు తొలి విడతగా బీమా పత్రాలను అందచేసిన భరత్ అందచేసారు. త్వరలో అందరికీ బీమా పత్రాలు అందచేస్తామన్నారు.

ఈ కార్యక్రమం లో పార్టీ సి.ఈ.సి సభ్యులు, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, పార్టీ శ్రేణులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మర్రిగూడెం ముత్యాలమ్మ తల్లి జాతర





**వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**కూనవరం,పెన్ పవర్,మార్చి 19.**మండలంలోని మర్రిగూడెం ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా జాతర నిర్వహించారు.చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు, నైవేద్యాలు,పట్టు వస్త్రాలు సమర్పించారు.శివపార్వతులైన భక్తులు మేళ తాళాలతో అమ్మవారికి శిరసుపై బోనాలను తీసుకొని వెళ్లి అమ్మకి సమర్పించి ప్రత్యేక పూజలుచేశారు.వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎస్ ఐ బి రామకృష్ణ,పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ పర్యావేక్షణలో అమ్మవారి జాతర జరిగింది.

# జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి 19:**స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన వేద పఠనం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కె. వెంకటేశ్వర్లు బృందం మంగళనాద స్వరాలతో, అనూష బృందం ప్రార్థనా గీతంతో అనంతరం అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. యరమిల్లి శివకుమార్ శర్మ అవధాని ,పండితులు బోపరాజు కృష్ణవంశీ వేదపఠనం నిర్వహించారు. ఎం.వి.ఆర్. సుబ్రహ్మణ్యం, శిష్య బృందం పంచాంగ శ్రవణం నిర్వహించి నూతన సంవత్సర ఫలితాలను వినిపించారు. కవి బలుసు వెంకట సత్య నారాయణ మూర్తి బృందం వసంత కవితా గానం, కవి సమ్మేళనంతో సాహిత్య రసాన్ని పంచారు. విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థులు వినాయక కీర్తన నృత్యం, దుర్గాప్రసాద్ బృందం ఆంధ్రనాట్యం ప్రదర్శించి సాంస్కృతిక శోభను తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఆర్ ఎమ్ సి కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇంచార్జి ఆర్డీవోలు కె. భాస్కర్ రెడ్డి, ఎమ్.ఆర్.ఆర్. ప్రేమ్ కుమార్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఈ.వి. సుబ్బారావు, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు, డీఆర్‌డిఏ పీడీ బి. నగేష్, డీఐపీఆర్వో కె. లక్ష్మీనారాయణ, డివిజనల్ పిఆర్వో ఎమ్. లక్ష్మణచార్యులు, వేద పండితులు, ప్రవచన కర్తలు, కవులు, కళాకారులు, డ్వాక్రా మహిళలు, అధికారులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం వేద పండితులు, పంచాంగకర్తలు, కవులు, కళాకారులను సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి వేడుకలను ముగించారు.

# ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలి



**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19 :** శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకీ మంచి జరగాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఆకాంక్షించారు. శ్రీ పరాభవనామ సంవత్సర (ఉగాది) న్ని పురస్కరించుకుని స్థానిక తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యుల కోసం నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో భాగంగా పంచాగం శ్రవణానికి ఆయన కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భావనీ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, సోదరి అపర్ణ తదితరులతో కలిసి హాజరయ్యారు. తొలుత వినాయక పూజ చేసి వేద పండితులు పంచాగ శ్రవణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది పచ్చడి జీవితాన్ని ప్రతిబింబిస్తుందని, జీవితంలో కష్టసుఖాలు, ఈ రుచులా కలగలిసి ఉంటాయన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జాబ్ క్యాలెండర్‌ను కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

నగరాభివృద్ధికి తాను విశేషంగా కృషి చేస్తున్నని, నగరంలో సుమారు రూ. 290 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతు న్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర మాజీ ప్రజా ప్రతినిధి, నాయకులు నీచ రాజకీయాలకు దిగజారి పోతున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# పుంత రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు



**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 19:**తాడిపూడి గ్రామంలోని బయ్యవరంలో ఉన్న పంట పొలాలకు రైతులు వెళ్లడానికి పుంత రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. ఈ సందర్భంగా వ్యవసాయ పనిముట్లు తీసుకువెళ్లాలన్నా, పండించిన పంటను బయటికి తీసుకురావాలన్న రైతులు నానా అవస్థలు పడేవారు. రైతులు పడుతున్న బాధలను గుర్తించిన సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో రైతులు పడుతున్న అవస్థలను వివరించి, పుంత రోడ్డుకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా నామా కొండబాబు మాట్లాడుతూ సుమారు ఒక కిలోమీటర్ మేర 20 లక్షల రూపాయల గ్రాంట్ తో పుంత రోడ్డుకు నిధులు మంజూరు అయిన కారణంగా గురువారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించామన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం లో గుడ్డు లేని బువ్వ



**వై రామవరం, పెన్ పవర్,మార్చి 19:** మధ్యాహ్న భోజన పథకంలో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గుడ్డు లేని బువ్వ బుధవారం పెట్టడం విశేషం.


మండలంలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న విద్యార్థులందరికి వారానికి ఐదు రోజులు కచ్చితంగా కోడిగుడ్డు పెట్టాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ దాలిపాడు ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఒకటి రెండు తరగతుల 27 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో గత వారం రోజుల నుండి కోడి గ్రుడ్లు లేకపోవడంతో పెట్టడం లేదని ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ఆమె తెలిపారు. ఏ కారణం చేత గుడ్లు లేవని ప్రశ్నించగా తనకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఏది ఏమైనా ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే మెనూ ఖచ్చితంగా అమలుపర చవలసిన బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులపై ఉందని తల్లిదండ్రులు కోరుచున్నారు. ఈ విషయమై వైరామవరం ఎంఈఓ 2 ఎం జోగేశ్వరరావును ఫోన్లో వివరణ కోరుటకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

# బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు లో వైసీపి ఇన్చార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 19.** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డు బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ ముస్లింల పవిత్ర మాసం రంజాన్ అని తెలిపారు. ఎంతో నియమనిష్టలతో ఈ మాసాన్ని ముస్లిం సోదరులు పాటిస్తారన్నారు. ముస్లిం సోదరులు తమకున్న దానిలో పరులకు సాయం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదర భావంతో వెలసిల్లుతారన్నారు. ప్రపంచ శాంతికి రంజాన్ మాసం ఒక ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో షేక్ హాజీ, షేక్ రెహమాన్, రోల్డ్ గోల్డ్ అక్బర్, కొరియర్ అక్బర్, షాయద్ అలీ, మునీర్, వార్డు ఇంచార్జ్ లు కలిశెట్టి తాతరావు,బుడి ప్రసాద్ ,పట్నాల గణపతి, ద్వారంపూడి కిరణ్ రెడ్డి,అశోక్ కుమార్ గారు,తనేటి అజయ్, లంక రాజశేఖర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు వింజమూరి శ్రీనివాస్ , అంజి రెడ్డి,ఎలిపే గాంధీ, మార్లమూడి సుబ్బారావు, గోపి జానీ, కార్యకర్తలు పాల్గొన్నారు.





## బిజెపి ఓ బి సి విభాగం ఆధ్వర్యంలో ఎంపీ పురందేశ్వరి కి సత్కారం



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, మార్చి19:** శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకల సందర్భంగా స్తానిక జె కె గార్డెన్స్ లో జరిగిన ఉగాది వేడుక లో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎంపీ పురందేశ్వరి ని పూలమాలతో దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమం లో బిజెపి ఓ బి సి విభాగం కాలేపు సత్య రామ్, అత్తిలి ఈశ్వర్, వి వి శ్రీనివాస్,, రేలంగి వెంకట,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కొండపాడు గ్రామంలో గ్రంథాలయ ప్రారంభోత్సవం





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ మార్చి 19:** గ్రామ అభివృద్ధి మరియు విద్యా విస్తరణకు దోహదం చేసే విధంగా మార్కొండపాడు గ్రామంలో గ్రంథాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. గురువారం రక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ( ఆర్ ఎస్ ఎస్ ఓ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రంథాలయం కోసం అవసరమైన భవనాన్ని గ్రామానికి చెందిన దాత శ్రీ సుంకవల్లి సూర్యనారాయణ సమకూర్చారు. గతంలో బస్టాండ్‌గా నిర్మించబడిన ఆ భవనం నిరుపయోగంగా ఉండటంతో, దానిని ఆర్ ఎస్ ఎస్ ఓ సంస్థ దత్తత తీసుకుని ప్రజలకు ఉపయోగపడేలా ఆధునిక గ్రంథాలయంగా అభివృద్ధి చేసింది.
గ్రంథాలయాన్ని శ్రీ సుంకవల్లి సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ ఎస్ ఎస్ ఓ సంస్థ ప్రెసిడెంట్ అల్లాడి బాలాజీ మరియు సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థులు మరియు యువతకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని, ఇది గ్రామ అభివృద్ధికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం శ్రీ సుంకవల్లి సూర్యనారాయణ ని ఎస్ కె. మెహబూబ్ ల్, గ్రామ పెద్దలు మరియు సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్థులు, సేవాభావం కలిగిన పలువురు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ మరియు ప్రభుత్వ సహకారంతో ఈ గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా శ్రీ మోదుగులమ్మ అమ్మవారి తిరునాళ్ళు



**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 19:** ఉగాది పురస్కరించుకుని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, తిరునాళ్ళు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుంటారు. ఇదే క్రమంలో మండల కేంద్రమైన తాళ్ళపూడిలో శ్రీ మోదుగులమ్మ అమ్మవారి తిరునాళ్ళు మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ నిర్వాహకులు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం అమ్మవారి సిరిబొమ్మను గ్రామ పుర వీధుల్లో బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు, గరగ నృత్యాలతో తిప్పుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ కు రక్షణ కల్పించాలి

సెక్యూరిటీ గార్డ్ చేయి నరికిన రోగి బంధువు

ఏ ఐ టి యు సి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు

సెక్యూరిటీ గార్డ్ చేయి నరికిన రోగి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19 :** రాజమండ్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు రక్షణ కల్పించాలని ఏఐటియుసి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు కోరారు.
గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి విచ్చేసి సెక్యూరిటీ గార్డ్స్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ , ఒక పేషెంట్ దేశ బత్తుల చిన్నారావు
గేటు వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డ్ కండలి సూర్య ప్రకాష్ రావు ను కత్తి తో నరకడానికి యత్నించుగా అతను చెయ్యి అడ్డు పెట్టడంతో అతను చెయ్యి తెగిందని ఆస్పత్రిలో సర్జరీ చేస్తున్నారని మధు తెలిపారు. నిందితుడి ని పోలీసుల అరెస్టు చేశారని అతని కఠినంగా శిక్షించాలని మధు డిమాండ్ చేశారు ఆసుపత్రి లో నాలుగు వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మధు కోరారు.
ఓపి వద్ద రోగులను సెక్యూరిటీ గార్డ్స్ వెయిటింగ్ చేయాలని కోరుతుంటే తిడుతున్నారని ఎంఎల్ఏ మనుషుల మని రెచ్చిపోతున్నారని మధు తెలిపారు . తాము తలుసుకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయంటూ సెక్యూరిటీ గార్డ్స్ పై బెదిరిస్తున్నారని మధు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ జోక్యం చేసుకుని దాడి చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ప్రసాద్ నాగ నరసింహారావు, కుమార్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు

## కొత్త ఏడాది ప్రజలందరికీ శుభకరం కావాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి19.** శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభకరం కావాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రగతి పదంలో ముందుకు సాగాలని, శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. నూతన తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా, గురువారం శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ వారిని ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవత శ్రీ బలుసులమ్మ వారి జాతర మహోత్సవంలోఈ సంవత్సరం ఉగాది పండుగ ప్రత్యేక శోభను సంతరించుకుందని అన్నారు. 12 సంవత్సరాల తర్వాత ఈ జాతర నిర్వహించే మహాభాగ్యాన్ని అమ్మవారు కల్పించారని, ప్రతి ఒక్కరు జాతరలో పాల్గొని
బలుసులమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ప్రభుత్వాలు మారినా, అధికారంలో ఎవరు ఉన్నా,జాతర నిర్విఘ్నంగా కొనసాగాలని అన్నారు.ప్రతి 5 సంవత్సరాలకు జాతర నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులతో తాడేపల్లిగూడెం సుభిక్షంగా ఉండేవిధంగా అందరూ కృషి చేయాలని అన్నారు. తాడేపల్లిగూడెంలో ఎవరి ఇంట వివాహం జరిగినా,ముందుగా గ్రామ దేవత బలుసులమ్మ వారికి చలిమిడి, పానకాలు సమర్పించిన తర్వాతే వివాహం జరగటం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని అన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా అమ్మవారి ఆలయం ఎలాంటి అభివృద్ధి లేకుండా నిర్లక్ష్యానికి గురైంది అన్నారు. 40 సంవత్సరాల తర్వాత మొదటిసారి తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్న సమయంలో జాతర నిర్వహించామని, మరలా ఇప్పుడు నిర్వహించే అవకాశం అమ్మ వారు కల్పించారని అన్నారు. జాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం భగత్ సింగ్ కాలనీ, టిట్కో గృహాల కొమ్ముగూడెం, వెంకటరమణ గూడెం పెంటపాడు, వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు పోలిశెట్టి రాజేష్, చేపల రమేష్, మద్దాల మణికుమార్, కసిరెడ్డి మధులత, వాడపల్లి సుబ్బరాజు, పైబోయిన వెంకటరామయ్య, గద్దం నాని, సురేషు, తదితరులు పాల్గొన్నారు

## ఆదర్శ యువనేత బొలిశెట్టి రాజేష్ జన్మదిన వేడుకలు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 19.** నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా నిస్వార్ధంగా పనిచేస్తున్న జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ యువతకు ఆదర్శంగా నిలిచారని పలువురు అభిమానులు ప్రశంసించారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు,జనసేన యువనాయకుడు బొలిశెట్టి రాజేష్ జన్మదినం సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జనసైనికులు మాట్లాడుతూ తండ్రి బాటలో నిస్వార్ధంగా ప్రజా సేవ చేస్తున్నారని అభినందనలు తెలిపారు. జనసేన సిద్ధాంతాలను ప్రజలలో కి తీసుకెళ్లడంలో రాజేష్ విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోట రాజా, నీలపాల దినేష్, పట్టణ వర్తనపల్లి కాశి చేపల రమేష్, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

ఐఐటి హైదరాబాద్ ఆచార్యులు ఆనంద్ మోహన్





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి.19** విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఐఐటి హైదరాబాద్ లోని రసాయన ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఆనంద్ మోహన్ సూచించారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని రసాయన ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రవహించే రక్తంలో గడ్డ పెరుగుదలపై రెండు సంక్షిప్త నమూనాల పోలిక అనే అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ మానవ రక్త ప్రసరణ వ్యవస్థలో రక్తం గడ్డకట్టే ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలియజేశారు. రక్త ప్రవాహంలో మరియు రక్తనాళాల గోడల వద్ద గడ్డ ఏర్పడే విధానం, దానిలో భాగస్వామ్యం చేసే జీవరసాయన మార్గాలు, కారకాలు, రక్తం యొక్క ప్రవాహ లక్షణాలు గురించి తెలిపారు. రక్త గడ్డ పెరుగుదలను గణితపరంగా నమూనా చేయడంలో ఉపయోగించే సంచరణ--ప్రసరణ--ప్రతిచర్య సమీకరణాల ప్రాముఖ్యతను తెలియజేశారు. మూడు భాగాల నమూనా, నాలుగు భాగాల నమూనాల మధ్య ఉన్న తేడాలను తెలియజేస్తూ, మూడు భాగాల నమూనా ద్వారా ప్రవహించే రక్తంలో గడ్డ పెరుగుదల ప్రక్రియను సులభంగా విశ్లేషించవచ్చని చెప్పారు. వీటితోపాటు
హైదరాబాద్ సాంకేతిక విద్యాసంస్థలో ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలు, ఎం.టెక్, పీహెచ్‌డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలు, సీజీపీఏ మరియు గేట్ అర్హత ఆధారంగా అందుబాటులో ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఆధునిక పరిశ్రమలు, పరిశోధనలకు అనుగుణంగా రూపొందించిన రసాయన ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు--యంత్ర అభ్యాసం మరియు గణనాత్మక రసాయన ఇంజినీరింగ్ వంటి ప్రత్యేక విభాగాల గురించి కూడా ఆయన తెలియజేశారు. పలువురు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం
విజ్ఞానదాయకమైన ఉపన్యాసం అందించిన ప్రొఫెసర్ ఆనంద్ మోహన్ ను ఏపీ నిట్ రసాయన ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వినోద్ కుమార్ రాజా శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ కుల్దీప్ రాయ్, డాక్టర్ సుశాంత్ కుమార్ బెహరా, డాక్టర్ శారదా ప్రసన్న మాలిక్, డాక్టర్ సాయి మణి కిరణ్ గరిమెళ్ళ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 24 న జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (విజయవాడ) ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్, చైర్మన్ వారి ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో శాప్ లీగ్స్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అధికారి డి ఎమ్ ఎమ్ శేషగిరి తెలిపారు. ఈ లీగ్స్‌లో భాగంగా మార్చి 24వ తేదీన జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్టారు 35 ప్లస్ , 45 ప్లస్ వయో విభాగాలలో పురుషులు, మహిళలకు 100 మీ.,

400 మీ., 800 మీ., 1500 మీ. పరుగుపందేలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, 4x100 మీటర్ల రిలే పోటీలలో ఎంపికలు నిర్వహిస్థారు.జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 30 , 31 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రాంగణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారు. ఆసక్తి గల మాస్టర్స్ క్రీడాకారులు తప్పనిసరిగా క్రీడా యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ లీగ్ వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన క్రీడాకారులు మాత్రమే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనుటకు అర్హులు. క్రీడలకు సంబంధించిన మరిన్ని వివరాలకు యోగా కోచ్ బి.వి.జి. నాగేంద్రన్ (మొబైల్: 9032934038) ను సంప్రదించవచ్చని తెలిపారు.

## రాజవొమ్మంగి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన లతశ్రీ



**గంగవరం/ రాజవొమ్మంగి, పెన్ పవర్, మార్చి 19:** రాజవొమ్మంగి ఎస్సైగా ఎల్.లతశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాజవొమ్మంగి ఎస్సై శివ కుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిన విషయం తెలిసిందే. దీంతో రాజవొమ్మంగి ఎస్సైగా లతశ్రీని ఎస్పీ అమిత్ బర్దర్ నియమించారు. ఇప్పటివరకు ఈమె పాడేరు మహిళ పోలీస్ స్టేషన్ ఎస్సైగా చేసి బదిలీపై వచ్చారు.

## ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్.హెడ్గేవార్ జయంతి



**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 19** రాజమండ్రి రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ వెంకటగిరి-2 లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్య భాస్కరరావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావ్ బలిరామ్ హెడ్గేవార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథి గా ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేసి హెడ్గేవార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోము వీర్రాజు మాట్లాడుతూ భారత్ జాతిని ఏకం చేయడం, దేశభక్తి , క్రమశిక్షణను పెంపొందించడం లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ ఏర్పడిందని తెలిపారు. ఆర్ఎస్ ఎస్ నాయకుడు రిమ్మలపూడి సుబ్బరాజు మాట్లాడుతూ, దేశాన్ని శక్తి వంతం చేసేందుకు హెడ్గేవార్ విశేష కృషి చేసారన్నారు. అనంతరం అసిరమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా గ్రామ ఆడపడుచులతో అమ్మవారికి ఘటాభిషేకం నిర్వహించి అన్నసమారాధన ఏర్పాటు చేసారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యానాపు ఏసు, కర్రి శ్రీనివాస్,ముద్రగడ సూర్యచంద్ర. పోతురాజు శ్రీనివాసరావు, తాడి కోటేశ్వరరావు, ఒలపల్లి రాము, ఈశ్వరరావు, కుబేరరావు, కాళ్ళ మంగదేవి,తదితరులు పాల్గొన్నారు

## కోరుకొండలో భారీగా ఈదురు గాలులు..

**- గాలి బీభత్సవానికి భారీ ప్లెక్స్ ధ్వంసం..**




**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 19:** కోరుకొండలో గురువారం సాయంత్రం భారీ ఈదురు గాలులకు భారీ ప్లెక్స్ చిరిగిపోయింది. ఈ సందర్భంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న ప్లెక్సీలు గాలి బీభత్సవానికి ధ్వంసం అయ్యాయి. ఉగాది సందర్భంగా ఏర్పాటుచేసిన ప్లెక్సీలు హఠాత్తుగా వచ్చిన ఈదురు గాలులు వర్షానికి భారీ ప్లెక్సీలు నేలకు ఒరిగాయి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

# మార్చి 24 న జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు









**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (విజయవాడ) ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్, చైర్మన్ వారి ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో శాప్ లీగ్స్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అధికారి డి ఎమ్ ఎమ్ శేషగిరి తెలిపారు. ఈ లీగ్స్‌లో భాగంగా మార్చి 24వ తేదీన జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్టారు 35 ప్లస్ , 45 ప్లస్ వయో విభాగాలలో పురుషులు, మహిళలకు 100 మీ.,

400 మీ., 800 మీ., 1500 మీ. పరుగుపందేలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, 4x100 మీటర్ల రిలే పోటీలలో ఎంపికలు నిర్వహిస్థారు.జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 30 , 31 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రాంగణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారు. ఆసక్తి గల మాస్టర్స్ క్రీడాకారులు తప్పనిసరిగా క్రీడా యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ లీగ్ వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన క్రీడాకారులు మాత్రమే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనుటకు అర్హులు. క్రీడలకు సంబంధించిన మరిన్ని వివరాలకు యోగా కోచ్ బి.వి.జి. నాగేంద్రన్ (మొబైల్: 9032934038) ను సంప్రదించవచ్చని తెలిపారు.

# తరలిపోతున్న అటవీ సంపద

**మితిమీరిపోతున్న అక్రమార్కుల ఆగడాలు**

**కంచె చేనుమేస్తున్న వైనం**

**కొందరు అటవీశాఖ అధికారులు చేతివాటం**

**సీతానగరం, పెన్ పవర్, మార్చి19:**
పోలవరం జిల్లా దేవీపట్నం మండలం నుండి గోకవరం రేంజ్ పరిధిలోకి ఇందుకూరు అడవి ప్రాంతంలో కలప అక్రమ రవాణా దారులకు అడ్డుఅదుపులేకుండా పోతోంది. కొందరు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్రమార్కుల చేతులు కలపడంతోనే దట్టమైన అడవులు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు కనిపిస్తోంది. అక్రమ రవాణాను అరికట్టాల్సిన సంబంధిత అటవీ అధికారులు చోద్యం చూస్తూ ఉండటంతో లక్షలు విలువైన సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారు.అటవీ సంపద అక్రమ వ్యాపారులకు ఇందుకూరు పరిధి నుంచి సీతానగరం మండలం వైపుకు నల్లగొండ కోటి రాపాక మార్గంగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అటవీ సంపదను బొలెరో వాహనాల్లో, అక్రమంగా తరలిస్తున్న అడ్డుకునే నాధుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా మానావాళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా అటవీ సంపద తరలిస్తున్నారు. అడవి విస్తరించి ఉండడంతో, ఏదో ఒక ప్రాంతం నుంచి అటవీ సంపద తరలిస్తూనే ఉంటారు.ఎంతో విలువైన అటవీ సంపదను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నా, పట్టించుకునే వారే లేరని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారో లేదో కానీ, అటవీ సంపద నరికివేత మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి రోజు పట్టపగలు పొగాకు బేరన్ లకు గోకవరం వైపు నుండి నల్గొండ కోటి రహదారి మార్గాల్లో అటవీ సంపద తరలుతోంది. చీకటి, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేసి చేస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి.



విపరీతంగా అటవీ సంపద నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని, వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. అడవులు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అడవుల సంరక్షణ అనే కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు అక్రమార్కులు యథేచ్ఛగా అటవీ సంపద నరుకుతూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది.ఇంటి దొంగలే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.అడిగినంత ఇస్తే అడిగే వారే లేరనట్లుగా అధికారుల తీరు మారింది. ఇక్కడ పనిచేసే కొంతమంది అధికారులు అవినీతిలో పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది.ఈ ప్రాంతంలో జన సంచారం పై పూర్తి గా నిషేధాజ్ఞలు ఉన్న అక్రమార్కులకు ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. యథేచ్ఛగా అడవి ప్రాంతంలో చొరబడుతున్న స్మగ్లర్లు అటవి సంపదను కొల్లగొట్టడంతో, పాటు వన్యప్రాణులకు ముప్పును తలపెడుతున్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు నిస్సాహాయత స్థితిలోనే కనిపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు,

అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డు లేకుండానే పోతోంది.అవినీతిలో ఆరితేరిన అక్రమార్కుల ఆగడాలు మితిమీరి పోతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇస్తే సరే, లేదంటే అక్రమార్కులను సైతం ముప్పుతిప్పలు పెడుతున్నట్లు చెబుతున్నారు. అందినకాడికి దండుకోవడం అటవీ శాఖ అధికారులకు అలవాటుగానే మారిందంటున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నత అధికారులు, అటవీ సంపద అక్రమార్కులపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

## కోడిపందాల పై దాడులు10 మంది అరెస్ట్ - 5 కోళ్లు స్వాధీనం



గోకవరం పెన్ పవర్ మార్చి 19:-- గోకవరం మండలంలోని కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై గోకవరం మహిళా ఎస్సై బి నాగమణి ఆధ్వర్యంలోని తన సిబ్బందితో దాడి చేశారు ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగ పవన్ కుమార్ తెలిపారు. కామరాజుపేట పంచాయితీ సూదికొండలో చెరువు వద్ద కోడిపందాలు ఆడుతున్నారు అనే సమాచారం అందుకున్న ఎస్ ఐ పవన్ కుమార్ ఆదేశాలతో మహిళా ఎస్ ఐ బి. నాగమణి తన సిబ్బందితో దాడి చేయ్యగా 10 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని 5 కోడి పుంజులు మరియు రూ. 1820/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## కంటే తేజాను కలిసిన ఫిషర్ మెన్ కమిటీ సభ్యులు..



**కమిటీ సభ్యులను అభినందించిన వినయ్ తేజ..**

**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 19:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే వినయ్ తేజను నూతనంగా ఎన్నికైన బూరుగుపూడి ఫిషర్మెన్ మెన్ సొసైటీ ప్రెసిడెంట్ గా ఎన్నికైన వేముదాసు సూర్యారావు, నెంబర్లు మెల్లుమి వెంకటేశ్వర్లు, మద్దా వీరన్న తదితరులు మర్యాదపూర్వకంగా తేజను కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను వినయ్ తేజ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపూడి గ్రామానికి చెందిన యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏ ఎం సి చైర్మన్ మార్ని ఆధ్వర్యం లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు

**ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 19**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవ్ ఆధ్వర్యం లో స్వగృహం లో శ్రీ పరాభవ నామసంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి దంపతులు, రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని, సంపద పెరగాలని ఆకాంక్షించారు. రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి శ్రీమతి ఝాన్సీ లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని అధికారులను ఉగాది పురస్కారాలతో సత్కరించి, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు అద్దం పట్టేలా వాసుదేవరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాంగ శ్రవణం అనంతరం సంప్రదాయ వంటలతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965

# వామ్మో.. పోలవరం జిల్లాలోకి మళ్లీ పెద్దపులి

**పోలవరం, మార్చి 19 (పెన్ పవర్):**ఇటీవల కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో సంచరించిన పెద్దపులి మరోసారి పోలవరం జిల్లాలోకి ప్రవేశించడం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం రాత్రి రాజవొమ్మంగి మండలంలోని కొండలింగంపర్తి, కొత్తపల్లి గ్రామాల సమీప అటవీ ప్రాంతాల్లో పులి సంచారం ఉన్నట్లు నిర్ధారణ అయింది. .స్థానికులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అటవీ అధికారులు వెంటనే పరిశీలన చేపట్టి, పులి కాళ్ల ముద్రలు, ఇతర ఆనవాళ్లను గుర్తించారు. ప్రస్తుతం ఈ పెద్దపులి బోర్నగూడెం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.గురువారం రాత్రి బోర్నగూడెం నుండి అడ్డతీగల రేంజి పరిధిలోని పరిమితడకవైపు పయనించినట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు.దీంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అడ్డతీగల సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.అటవీశాఖ అధికారులు అప్రమత్తమై పులి కదలికలను నిరంతరం గమనిస్తూ ట్రాకింగ్ చర్యలు చేపట్టారు. గ్రామాల పరిసర ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేసి, ప్రజలు అడవికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులను బయటకు వదలకుండా కట్టుదిట్టమైన భద్రత పాటించాలని సూచించారు.అదేవిధంగా, పులిని సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి మళ్లించే చర్యలు కూడా చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే ట్రాంక్విలైజ్ చేసి పట్టుకునే చర్యలు కూడా పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితిపై అటవీశాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తుండగా, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు మరోసారి హెచ్చరించారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో గోకవరం నందు పంచాంగ శ్రవణం




**గోకవరం పెన్ పవర్ మార్చి 19:-** ఉగాది సందర్భంగా లోక కళ్యాణార్థం హిందూ ధర్మ పరిరక్షణార్థం సూర్య పీఠం స్థల దాతలి అక్షింతల రాజా స్వగృహమునందు వేద పండితులు ఆనిమల్ల రామకృష్ణ శాస్త్రి చే పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ఈ సందర్భంగా రామకృష్ణ శాస్త్రి యుగాది వైభవాన్ని సనాతన ధర్మ గొప్పతనాన్ని శ్రోతలకు వివరించారు.సూర్య పీఠం ఫౌండర్ ట్రస్టి తోట సాయిబాబా మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కొరకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నటువంటి అంకితభావం తో కూడిన నిజమైన హిందూ ధార్మిక కార్యకర్త అక్షింతల రాజా అన్నారు.ఈ కార్యక్రమంలో పిల్లంగోరు పాపారావు, సుంకర త్రిమూర్తులు,ఆకే మనోజ్,కంచర్ల కిరణ్,కాజా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి దేవస్థానంలో కళ్యాణ మహోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 19:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ర్యాలి గ్రామంలోని వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానంలో జరగనున్న శ్రీ కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కళ్యాణ శుభపత్రికలు, గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు,కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పంచాగ శ్రవణం



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 19:**మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకట్వేర స్వామి ఆలయంలో గురువారం పరాభవనామ సంవత్సరాన్ని పురష్కరించుకొని పంచాగ శ్రవణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆద్వర్యంలో వర్జుల సత్తిపండుశర్మ పంచాగ శ్రవణం భక్తులకు వినిపించారు.ఈ సందర్భంగా కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పంచాంగ శ్రవణం శ్రద్దగా విన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధన్ శ్రీధర్ చార్యులు, మళ్ళ నాగు, లంక మూర్తి, దాడి రాజగోపాల్ (రాజా )దాడి పెదబుజ్జి, పాముల వీరబాబు, శరకణం తాతజీ, శరకణం పెదకాపు, పెంటకోట సాయి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తి పథకంతో కొత్త దిశ

**ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం**

**మంత్రి సుభాష్**





**రామచంద్రపురం, మార్చి 19:** రాష్ట్రంలో దివ్యాంగుల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి" పథకాన్ని రామచంద్రపురంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులతో కలిసి మంత్రి స్వయంగా బస్సులో ప్రయాణించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ పథకం ద్వారా 40 శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబడింది. వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ ఇవ్వడం జరిగింది.సాధారణ బస్సుల్లో పూర్తిగా ఉచితం,ఏసీ,డీలక్స్ బస్సుల్లో సగం చార్జీ మాత్రమే వసూలు చేయనున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పరిమిత వర్గాలకే ఉన్న సదుపాయాన్ని ఇప్పుడు 21 రకాల అంగవైకల్యాలున్న వారందరికీ విస్తరించామని తెలిపారు.కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 2,600 మంది మాత్రమే లబ్ధి పొందగా,ఈ పథకం ద్వారా 20,000 మందికి పైగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు.జిల్లాలో 194 బస్సులను ఈ పథకానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మందికి పైగా దివ్యాంగులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లు దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఉచిత ప్రయాణం, పెన్షన్ పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు కూడా దివ్యాంగులకు కేటాయించిన సీట్లను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఉపాధి, వైద్యం, ఇతర అవసరాలకు సులభతరం అవుతుందని మంత్రి తెలిపారు. నిరుద్యోగ నిర్మూలనలో భాగంగా జాబ్ క్యాలెండర్ ద్వారా 10,060 ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు సాధించి 20 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు ప్రభుత్వంపై కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, మంత్రి సుభాష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇక దివ్యాంగులకు ఆర్థిక సహాయంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం రూ.10,000 అందజేశారు. గుర్తింపు కార్డుల కోసం అవసరమైన ప్రాసెసింగ్ చార్జీలను భరించేందుకు ఈ సహాయం అందించారు. అవసరమైతే మరింత సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఎం. శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ రాజు, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, డిపో మేనేజర్ పి. భాస్కరరావు, అసిస్టెంట్ మేనేజర్ కె. రవికుమార్ తదితరులు, కూటమి నాయకులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా ఉగాది వేడుకలు



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 19:** తెలుగు నూతన సంవత్సరాది పరాభవ నామ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో నూతన వెలుగులు నింపాలని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్ ఆకాంక్షించారు. గురువారం కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు రెడ్డిపల్లి రాజేష్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరాది అయిన పరాభవ నామ సంవత్సరం అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం నింపాలని కోరుకున్నారు. ప్రతి పండుగను క్లబ్ సభ్యులందరితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ చైతన్యకృష్ణతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుల కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

- పంచాంగ శ్రవణంతో నూతన సంవత్సరానికి ఆహ్వానం




**కాకినాడ పెన్ పవర్, మార్చి 19:** తెలుగు సంవత్సరాది శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ అరెగెల శ్రీనివాస్ (బున్నీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది.ఈ సందర్భంగా వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించి నూతన సంవత్సరానికి సంబంధించిన గ్రహగతులు, శుభ ముహూర్తాలు, రాశి ఫలితాలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారికి వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు.అరెగెల శ్రీనివాస్ (బున్నీ) మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు.

అనంతరం వేద పండితులను ఘనంగా సత్కరించి, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పాల్గొన్న వారు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ముమ్మిడి వెంకటేష్, లాయర్ దుర్గాప్రసాద్, జున్నూరి బాబ్జి, బర్ల శ్రీనివాస్, పబ్బినీడి అజయ్, రావు, అంకమరెడ్డి రాము నాయుడు, దొరబాబు, సతీష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రంలో భక్తుల రద్దీ - అన్నదానానికి విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 19** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో గురువారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కొనసాగింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకున్నారు.ఉగాది పరాభవ నామ సంవత్సర శుభ సందర్భంగా ఆలయ సన్నిధిలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఇదిలా ఉండగా, ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి పాలకొల్లు పట్టణానికి చెందిన చవటపల్లి కృష్ణ మోహనరావు--నాగమణి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,111 విరాళాన్ని సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉపాధ్యక్షులు నల్ల సూర్యచక్రధర్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



## ఆర్యవైశ్య వాసవి క్లబ్ చలివేంద్రం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 19:** జగ్గంపేట సెంటర్లో జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఉగాది సందర్భంగా ప్రారంభించారు. జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. మొదటిరోజు చలివేంద్రంలో మజ్జిగ, మంచినీటికి ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు) ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్ఐ టి. రఘునాథరావు, కిర్లంపూడి గండేపల్లి ఎస్సైలు సతీష్, శివ నాగబాబు, ఆర్యవైశ్య సంఘం మానేపల్లి బంగారాజు, ధారా శ్రీనివాస్, ఎం.రామానుజన్, ఎం. నారాయణ, ఎన్.శ్రీనివాస్, మురళి ఆర్యవైశ్య, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# చెన్నై సూపర్ కింగ్స్ వైస్ కెప్టెన్ గా సంజు శాంసన్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో నాయకత్వ బాధ్యతలు మారే అవకాశం ఉందని మాజీ భారత క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజస్థాన్ రాయల్స్ జట్టు నుంచి ట్రేడ్ డీల్‌లో భాగంగా సీఎస్‌కేలోకి సంజు శాంసన్ వచ్చాడు. అతడి రాకతో సీఎస్‌కే జట్టు నిర్మాణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. అతనిని నేరుగా లీడర్‌షిప్ గ్రూప్‌లో చేర్చే అవకాశం ఉందని కుంబ్లే పేర్కొన్నారు. జియో హాట్‌స్టార్‌లో ప్రసారమైన “గేమ్ ప్లాన్ -- నో యువర్ టీమ్” కార్యక్రమంలో కుంబ్లే మాట్లాడుతూ.. సంజుకు వైస్ కెప్టెన్ బాధ్యతలు ఇవ్వడం సరైన నిర్ణయం అన్నారు. ఆ పాత్రకి సరైన న్యాయం చేస్తాడని చెప్పారు. రాజస్థాన్ జట్టుకు అతను చాలా కాలం కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందుకే నాయకత్వ బాధ్యతలు అతనికి కొత్తేమి కాదని అనిల్ కుంబ్లే అన్నారు.సంజు శాంసన్ ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఎన్నో సీజన్ల పాటు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు డిప్యూటీగా, అలాగే ఎంఎస్ ధోనీ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తుందని అనిల్ కుంబ్లే వెల్లడించారు. గత ఐపీఎల్ 2025 సీజన్‌లో గైక్వాడ్ గాయం కారణంగా ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. దీంతో జట్టు నాయకత్వ బాధ్యతలు మళ్లీ ధోనీకి అప్పగించాల్సి వచ్చింది. ఆ సీజన్‌లో సీఎస్‌కే చరిత్రలో తొలిసారి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. కానీ ఈసారి ఐపీఎల్ 2026లో బలంగా పునరాగమనం చేయాలని సీఎస్‌కే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరో టైటిల్ గెలవాలనే ఆశయంతో జట్టు సన్నద్ధమవుతోందన్నారు.

**సీఎస్కే స్క్వాడ్ 2026:**

**బ్యాటర్లు:** రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), దేవాల్డ్ బ్రేవిస్, అయుష్ మత్రే, కార్తిక్ శర్మ, సర్ఫరాజ్ ఖాన్, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్)

**ఆల్‌రౌండర్లు:** అన్షుల్ కాంబోజ్, జేమీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, ప్రశాంత్ వీర్, మ్యాథ్యూ షార్ట్, అమన్ ఖాన్, జాక్ ఫౌల్క్స్, శివం దూబే

**బౌలర్లు:** ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, ముఖేష్ చౌదరి, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, గుర్జప్నీత్ సింగ్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, రాహుల్ చాహర్

# సంజుతో ఎవరిని పోల్చలేం.. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28న ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అన్ని జట్లు సిద్ధమవుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ సైతం తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఈసారి ట్రోఫీనే టార్గెట్ గా బరిలోకి దిగుతుంది ఈ టీమ్. రాజస్థాన్ కి చాలా కాలం పాటు ఆడిన సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ కు ట్రేడింగ్ కావడంతో పాటు సీఎస్కే నుంచి సామ్ కరాన్, రవీంద్ర జడేజాలు వచ్చారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ మీడియాతో మాట్లాడుతూ.. “సంజు శాంసన్ ఆట ప్రత్యేకం, అతడితో ఎవరితో పోల్చలేమన్నారు. ప్రతి ఆటగాడు గెలిచేందుకు ఆడతాడని పేర్కొన్నారు. ఇక గత సీజన్లో చివరి దశలో మేము కొంచెం స్వేచ్ఛగా ఆడి ఉంటే, కచ్చితంగా టోర్నీలో మరింత ముందుకు వెళ్లే వాళ్లం.. ఈసారి ఆ తప్పులను సరిదిద్దుకుంటున్నామని పరాగ్ వెల్లడించారు. టీమ్ లో స్పిన్, ఫాస్ట్ బౌలర్ల సమతుల్యత ఉంది.. బ్యాటింగ్‌లో రైట్-హ్యాండ్, లెఫ్ట్-హ్యాండ్ బ్యాట్స్‌ల సమతుల్యత ఉండటంతో ఈసారి మా దగ్గర స్ట్రాంగ్ బ్యాటింగ్ లైన్ ఉందని రియాన్ పరాగ్ చెప్పారు. రవీంద్ర జడేజాపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది.. హోమ్ గ్రౌండ్‌లో ఆడడంపై ఎక్కువ ప్రభావం ఉండదన్నారు. స్టేడియం ఏదైనా ఈసారి దుమ్మురేపి మాత్రం రాజస్థాన్ రాయల్స్ జట్టే అని ధీమా వ్యక్తం చేశారు. కొంతమంది అభిమానులు చీర్ చేస్తారు, మరీ కొందరు ప్రత్యర్థులను గేలి చేస్తారు.. కానీ మేము డిస్ట్రాక్షన్స్ నుంచి దూరంగా, మా ఆటపై దృష్టి పెడతామని తెలిపారు. మా లక్ష్యం ఒక్కటే ఈ టోర్నీలో బలమైన ప్రదర్శన ఇవ్వడమేనని పరాగ్ పేర్కొన్నారు. జడేజా అద్భుతమైన ఆల్‌రౌండర్, ఆయనపై జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుందని రియాన్ పరాగ్ అన్నారు. మ్యాచ్ పరిస్థితుల ప్రకారం, కష్ట సమయాల్లో వీటిని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామన్నారు. వైభవ్ సూర్యవంశీపై హెడ్ కోచ్ కుమార్ సంగక్కారా విశ్వాసం పెట్టుకున్నారు.. అతను యంగ్ క్రికెటర్ జస్ట్ 15, -16 ఏళ్ళలోనూ అద్భుతమైన ఫామ్ కనబరుస్తున్నాడు.. అతని కోసం ప్రత్యేక వ్యూహం రూపొందించామని చెప్పారు. ఇప్పటికే జట్టు ప్రిపరేషన్లు పూర్తి చేసింది.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతి అంశంపై దృష్టి పెట్టాం.. ప్రతీ రోజు బాగా ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నామని రియాన్ చెప్పారు.

**IPLలో రాజస్థాన్ రాయల్స్ స్క్వాడ్:**

రవీంద్ర జడేజా, సామ్ కరాన్, డొనోవన్ ఫెరేరా, సందీప్ శర్మ, శుభం దుబే, వైభవ్ సూర్యవంశీ, లుహాండ్రే ప్రిటోరియస్, షిమ్రాన్ హెట్మియర్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, యుధ్వీర్ సింగ్ చారక్, జోఫ్రాండ్ మాతృమూర్తి, జోఫ్రాండ్ ఆర్చాండ్, తుషార్నా రవి బిష్ణోయి, సుశాంత్ మిశ్రా, యష్ రాజ్ పుంజా, విఘ్నేష్ పుతూర్, రవి సింగ్, అమన్ రావ్, బ్రిజేష్ శర్మ, ఆడమ్ మిల్న్, కుల్దీప్ సేన్.

# అయ్యో కేకేఆర్‌కు వరుస ఎదురుదెబ్బలు.. రూ. 18 కోట్లు పెట్టిన ఫలితం శూన్యం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకి వరుస షాక్స్ తగిలాయి. భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలతో ఢాకా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ని కేకేఆర్ జట్టు నుంచి తప్పించింది. ఇక టీమిండియా స్టార్ పేసర్ హర్షిత్ రాణా గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే ఛాన్స్ కనిపిస్తుంది. పేస్ దళాన్ని పటిష్టం చేసే క్రమంలో శ్రీలంక బౌలర్ మతీశ పతిరణని తుది జట్టులోకి తీసుకుంటే ఇప్పుడు ఆడటంపై కూడా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.వరల్డ్ కప్ టోర్నమెంట్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో గాయపడిన పతిరణ.. టోర్నీకి దూరమయ్యాడు. దీంతో ఇటీవలే అతడు ఫిట్నెస్ సాధించినట్లు తెలుస్తుంది. కానీ శ్రీలంక క్రికెట్ బోర్డు మాత్రం ఐపీఎల్లో ఆడేందుకు మతీశకు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) ఇచ్చేందుకు జాప్యం చేస్తున్నట్లు సమాచారం. పతిరణ ఫిట్నెస్ పై తమకు సంతృప్తికరమైన సమాచారం వచ్చినపుడే చీూజ ఇవ్వాలని చూస్తున్నట్లు లంక బోర్డు భావిస్తుంది. ఈ విషయంపై కేకేఆర్ ూాజ బోర్డుతో పతిరణ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడనే అంశంపై చర్చిస్తుంది. శ్రీలంక క్రికెట్ బోర్డుతో సంప్రదింపులు చేస్తున్నాం.. ప్రతి రోజు పతిరణ కోసం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేయడం, రద్దు చేయడం జరుగుతోందని కేకేఆర్ యాజమాన్యం పేర్కొనింది. కాగా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున 2022లో ఐపీఎల్లోకి వచ్చిన అతడు.. మహేంద్ర సింగ్ ధోని ప్రియ శిష్యుడిగా కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 32 ఐపీఎల్ మ్యాచ్లు ఆడిన మతీశ పతిరణ.. 47 వికెట్లు పడగొట్టాడు. 2026 వేలానికి ముందు చెన్నై అతడిని విడిచి పెట్టగా.. కేకేఆర్ రూ. 18 కోట్లకు దక్కించుకుంది. ఓవైపు హర్షిత్ రాణా జట్టుకు దూరమవడం.. పతిరణ విషయంలోనూ సస్పెన్స్ కేకేఆర్ కి పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు, పతిరణ మేనేజర్ మాత్రం త్వరలోనే అతడు అందుబాటులోకి వస్తాడనేలా సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.



**శృతి హాసన్ యొక్క భీకరమైన బ్రౌన్ గౌన్ గ్లో: బ్యాక్ ఇన్ యాక్షన్**

# మొత్తానికి సమంతకు ఆ ఛాన్స్ సమీపిస్తోందా?



దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసిన సమంత బాలీవుడ్ వెండితెర ఎంట్రీ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్ సిరీస్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సత్తా చాటినా? అది బుల్లి తెర కావడంతో? అమ్మడు సంతృప్తి చెందలేదు . ఒక భారీ హిందీ సినిమా ద్వారా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించాలనే ప్రయత్నాలు చేస్తున్నా? సరైన ఛాన్సులు రాకపోవడంతో నీరిక్షణ తప్పలేదు. తాజాగా సామ్ వెండి తెర ఎంట్రీకి సమయం ఆసన్నమైంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందున్న కొత్త సినిమాలో సమంతను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, మిస్టర్ అండ్ మిసెస్ మాహి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శరణ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్‌కు సమంతతో ఉన్న స్నేహం కారణంగా ఈ ఛాన్స్ దక్కుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఛాన్స్ ఫైనల్ కానుందని సమాచారం. అదే నిజమైతే సమంత ఆనందానికి అవధులుండవ్. సమంత హిందీ సినిమాల్లో నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తోంది. మధ్యలో అనారోగ్య సమస్యలు , వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు విరామం తీసుకున్నప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు.ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకోవడం అమ్మడికి కెరీర్ పరంగానూ కొంత కలిసొచ్చిందని చెప్పొచ్చు. భర్త వైపు నుంచి కూడా కొత్త అవకాశాలు రావడానికి ఛాన్స్ ఉంది. ఇప్పటికే ముంబైలో ఖరీదైన ఇంటిని కూడా కొనుగోలు చేసిన సమంత మకాంను పూర్తిగా బాలీవుడ్‌కు మార్చే సింది. సిద్ధార్థ్ మల్హోత్రా వంటి హ్యాండ్సమ్ హీరో సరసన ఆమె జోడీ కడితే బాలీవుడ్‌లో ఒక ఫ్రెష్ అండ్ క్రేజీ కాంబినేషన్ అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు.శరణ్ శర్మ చిత్రాలు భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఉంటాయి. దీంతో సమంత లాంచింగ్ ఇదే పర్ఫెక్ట్ స్టోరీ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే హిందీ భాషపై అమ్మడు పట్టు సాధించింది. అక్కడి ప్రేక్షకులకు నటనతో మరింత దగ్గరవ్వాలని ఆశపడుతోంది. ధర్మ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్ లో లాంచ్ అయితే? వచ్చే గుర్తింపు కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. హబ్బీ రాజ్ నిడిమోరు సహకారం కూడా అన్ని రకాలుగా దక్కుతుంది. ఇకపై భర్త దర్శకత్వంలో కూడా సినిమాలు చేయడానికి ఛాన్స్ ఉంటుంది. బాలీవుడ్ లో రాజ్ కున్న పరిచయాలతో మరిన్ని అవకాశాలకు ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి సమంత బాలీవుడ్ ఎంట్రీ ఆలస్యమైనా? స్ట్రాంగ్ గానే కనిపిస్తుందని చెప్పొచ్చు.



**మీనాక్షి చౌదరి బ్లాక్ టాప్ మరియు డెనిమ్ లుక్‌లో హల్ చల్ చేస్తుంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965